సాక్షి
విశాఖపట్నం

బుధవారం, 15, అక్టోబర్, 2025

I


అనంతుని పవిత్రోత్సవాలకు ఏర్పాట్లు IIలో


ఆర్టీసీ కార్తీకం స్పెషల్స్ IIలో


'కె-ర్యాంప్' ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ హీరో కిరణ్ అబ్బవరం IIలో

స్టీల్‌ప్లాంట్, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ఉమ్మడి పోరు

నోరెత్తని నేతల ఇళ్లను ముట్టడిస్తాం

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం

హాజరైన ఆయా యూనియన్ల నాయకులు, న్యాయవాదులు, రాజకీయనేతలు


వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

విశాఖ ఉక్కు, వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనక్కి తీసుకునేలా ఐక్య పోరాటం చేయాలని మేధావులు, న్యాయవాదులు, రాజకీయ నేతలు నిర్ణయించారు.'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' అనే నినాదంతో ప్రజలంతా ఉద్యమిస్తేనే స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోగలమని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ పోరాటాన్ని ఉధృతం చేసేందుకు రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలతో కలిసి అఖిల పక్ష రాజకీయ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మంగళవారం విశాఖలోని పౌర గ్రంథాలయంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ముఖ్య అతిథిగా హాజరైన ఈ సమావేశానికి ప్రముఖ న్యాయవాది పాక సత్యనారాయణ అధ్యక్షత వహించారు.

– సాక్షి, విశాఖపట్నం

సంపూర్ణ బంద్‌కు పిలుపు



కూటమి ప్రభుత్వం రాజ్యాంగంలోని 'సోషలిస్ట్' అంశాన్ని కాలరాస్తోంది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం చేయాలి. స్టీల్ ప్లాంట్, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి నగరంలో ఒక రోజు సంపూర్ణ బంద్ పాటించాలి. వేల కోట్లు అప్పు చేసి అమరావతి నిర్మాణం చేస్తున్నప్పుడు, పేదలకు ఉచిత వైద్యం అందించే మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడం అన్యాయం. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిల పక్ష కమిటీ వేసి పోరాటం చేస్తే తాము తప్పకుండా పాల్గొంటాం.

– డాక్టర్ ఎన్‌ఏడీ పాల్,
ఆల్ ఇండియా బహుజన మేధావుల సమైక్య అధ్యక్షుడు.

ఉద్యమాన్ని అణిచివేసే కుట్ర



ఎంతో మంది ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేస్తామంటే చూస్తూ ఊరుకోబోం. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాన్ని అణచివేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఉద్యమ టెంట్‌ను తొలగించి ఉద్యమాన్ని లేకుండా చేసేందుకు ప్రయత్నాలు చేసింది. విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులను తొలగించడం, ఉద్యమాన్ని లేకుండా చేయడమే పనిగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

– ఆదినారాయణ, ఏఐటీయూసీ నాయకుడు

అమ్మేయడం..తీసేయడం..



కేంద్ర ప్రభుత్వ ఆశయం, లక్ష్యం దేశంలో ప్రభుత్వ సంస్థలను అమ్మేయడం, మూసేయడం, ఉద్యోగాలను తీసేయడమే. దేశవ్యాప్తంగా విశాఖ స్టీల్ ప్లాంట్ వంటి 142 కంపెనీలను అమ్ముతున్నారు. చిన్న కంపెనీలను మూసేస్తున్నారు. మైనింగ్ పేరిట కొండలు, సంపదను లాగేసుకుంటున్నారు. అడ్డుపడితే మావోయిస్టుల పేరుతో చంపేస్తున్నారు. ఇటీవల విశాఖలో మోదీ, చంద్రబాబు యోగా కార్యక్రమం నిర్వహించడానికి కారణం - తాము ఏమి చేసినా దేశ ప్రజలు అవయవాలు మూసుకుని, ఊపిరి పీల్చుకోవాలే తప్ప ప్రశ్నించకూడదు అనేదే వారి ఆశయంలా ఉంది.

– శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ నాయకుడు

'లా నేస్తం' ఎత్తివేతతో ఇబ్బందులు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 'లా నేస్తం' పథకం ద్వారా ప్రాక్టీస్ చేసే జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ. 5 వేలు అందేవి. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని ఎత్తేయడంతో జూనియర్ న్యాయవాదులు జీవనం కోసం ప్రైవేట్, మార్కెటింగ్ కంపెనీల్లో చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వంలో లాయర్ల కోసం కేటాయించిన కార్పస్ ఫండ్‌కు కూడా కూటమి ప్రభుత్వం టోకరా పెట్టింది. లీగల్ సెల్ తరఫున మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తాం.

– బాజీనాయుడు, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు

ఉద్యమం.. ఉధృతం



విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కూటమి ప్రభుత్వం వైఖరి మార్చుకోకపోతే, త్వరలో ఈ ప్రాంత కూటమి ఎంపీలు, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తాం.ఎన్నికల ముందు ప్రైవేటీకరణకు వ్యతిరేకమని చెప్పిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇప్పుడు దగ్గరుండి ప్రైవేటీకరణకు సహకరిస్తున్నారు. ఉత్తరాంధ్ర ఆత్మగౌరవమైన స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరుగుతున్నా కూటమి ప్రజాప్రతినిధులు నోరు మెదపడం లేదు. వైఎస్సార్, వైఎస్ జగన్ హయాంలోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి జరిగింది. చంద్రబాబు మళ్లీ అభివృద్ధిని అమరావతికే కేంద్రీకరించి, లక్షల కోట్లు అప్పు చేసి ఉత్తరాంధ్రకు అన్యాయం చేస్తున్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించిన మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారు. విశాఖలో విలువైన భూములను లులు, ఉర్సా వంటి సంస్థలకు కారుచౌకగా ఇస్తున్నారు. స్టీల్ ప్లాంట్, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవడానికి మేధావులు, రాజకీయ నేతలు ఐక్యంగా పోరాడాలి., ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడేందుకు ముందుకు వచ్చే అన్ని అఖిల పక్ష రాజకీయ పార్టీలను కలుపుకుని ముందుకువెళతాం.

– కేకే రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

వందేళ్ల తర్వాత ప్రభుత్వ వైద్య కళాశాల



ఉత్తరాంధ్ర ప్రాంతంలో 1921లో ఆంధ్రా మెడికల్ కాలేజీ ఏర్పాటైంది. వందేళ్ల తర్వాత ఇదే ప్రాంతంలో అనకాపల్లి, పాడేరుతో పాటు రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటి ద్వారా 2,550 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉంటాయి. పీజీ వైద్య కోర్సులూ వస్తాయి. వీటిని పీపీపీలో నిర్వహించాలనుకోవడం ఆక్షేపణీయం

– పాక సత్యనారాయణ,
వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి.

కీడు చేస్తున్న చంద్రబాబు



రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను తమకు అనుకూలమైన తాబేదారులకు అప్పగించేందుకే కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గతంలో వైఎస్సార్‌సీపీ హయాంలో స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఉద్యమాన్ని ఏనాడూ అడ్డుకోలేదని, కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉద్యమ టెంట్‌ను కూడా తొలగించి అణిచివేస్తోంది. రాష్ట్ర విభజన సమయంలో చంద్రబాబు 'స్పెషల్ స్టేటస్ వద్దు, ప్యాకేజీ ముద్దు' అని చెప్పి రాష్ట్రానికి కీడు చేశారు.

– రామారావు, సీఐటీయూ నేత

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరిట దుష్ప్రచారం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచి పనులను కూడా కూటమి ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోంది. కేంద్రం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను సైతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై నెట్టి కూటమి నేతలు తప్పుడు ప్రచారం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగి వచ్చేవరకు ప్రజా ఉద్యమాలు నిర్వహించి, ఈ ప్రాంతంలోని విశాఖ స్టీల్ ప్లాంట్, మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకుంటాం.

– నీరుకొండ రామచంద్రరావు, స్టీల్ ప్లాంట్ ఉద్యమ నాయకుడు

శ్రీశ్రీ స్ఫూర్తితో పోరాడాలి



విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శ్రీశ్రీ మాటలను గుర్తుచేసుకుని పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్లాలి. విశాఖ కేంద్రంగానే స్టీల్ ప్లాంట్ ఉద్యమం మొదలవ్వాలి. కేసులు పెట్టినా భయపడకుండా పోరాటం చేసినప్పుడే ప్లాంట్‌ను కాపాడుకోగలం. ఈ ఉద్యమానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది. నిరుద్యోగ భరోసా అడిగితే .. బూటు కాలితో.. లాఠీతో ఇబ్బంది పెడుతున్నారు. ఆంధ్రయూనివర్సిటీలో సకాలంలో వైద్య సేవలు అందకపోవడంతో విద్యార్థి మృతి చెందాడు. ఎమెర్జెన్సీ అంబులెన్స్‌లో ఆక్సిజన్ కూడా ఉండకపోతే ఈ ప్రభుత్వం ఉంటే ఏంటి.. లేకపోతే ఎందుకు..?

– కొండా రాజీవ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్

వైద్య కళాశాలలను కాపాడుకోవాలి



మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాకోక మెడికల్ కళాశాలను నిర్మించాలని వైఎస్సార్‌సీపీ నిర్ణయం తీసుకుంటే, ఇప్పటి కూటమి ప్రభుత్వం వాటిని పీపీపీ పద్ధతికి అప్పగించాలని చూస్తోంది. ఇదే జరిగితే ఉచిత వైద్యం, వైద్య పేదలకు దూరం అవుతాయి. ఇప్పుడు ఐక్యంగా పోరాటం చేస్తేనే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుంది.

– సుబ్బిరెడ్డి, ప్రముఖ న్యాయవాది.

న్యూస్‌రీల్

కల్తీ మద్యం గుర్తించేందుకు యాప్

విశాఖ సిటీ: విశాఖలో కల్తీ మద్యం నివారించే విషయంలో ఎక్సైజ్ శాఖ కృత నిశ్చయంతో పని చేస్తోందని జిల్లా ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఆర్.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కల్తీ మద్యం గుర్తించేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను వినియోగదారులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ ద్వారా బాటిల్‌ను స్కాన్ చేస్తే మద్యం నాణ్యత వెంటనే తెలిసిపోతుందన్నారు. ఒకవేళ స్కాన్ చేసినప్పుడు అది కల్తీ మద్యం అయితే సమాచారం విజయవాడలోని ఎక్సైజ్ కేంద్ర కార్యాలయం చేరిపోతుందని తద్వారా వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సురక్ష యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్‌లో సులువుగా డౌన్‌లోడ్ చేసుకుని ఉపయోగించేందుకు వీలుగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్లు చెప్పారు. కల్తీ మద్యం అనుమానం వచ్చిన వెంటనే ఈ యాప్ ద్వారా నిర్ధారించేందుకు వీలవుతుందన్నారు.

మైత్రి వాక్ 2.0 పోస్టర్ ఆవిష్కరణ


మైత్రి వాక్ 2.0 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్

మద్దిలపాలెం: ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా డిసెంబర్ 6న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న 'మైత్రి వాక్ 2.0' పోస్టర్‌ను మంగళవారం ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని హ్యూమన్ జెనెటిక్స్ విభాగం, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. పోస్టర్ ఆవిష్కరణలో ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీ ఆర్ రాజు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఏ. నరసింహారావు, రిజిస్ట్రార్ ఆచార్య కె. రాంబాబు, హ్యూమన్ జెనెటిక్స్ విభాగాధిపతి ఆచార్య వి. లక్ష్మి, సెంటర్ సెంటర్ ఫర్ సోషల్ ఇంక్లూజన్ డైరెక్టర్ డాక్టర్ పి. సుబ్బారావు, ఆచార్య జి. సుధాకర్, ఆచార్య జి. పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏయూ-జీవీఎంసీ మధ్య
దివాళీ ట్రేడ్ ఫైర్

- ఏయూ గ్రౌండ్‌లో స్టాళ్ల ఏర్పాటుపై గందరగోళం
- 8 రోజులకు అనుమతులు ఇవ్వాలని జీవీఎంసీ కమిషనర్ లేఖ
- ఏయూ ఆడిటోరియాలు, మైదానాల్లో ప్రైవేటు కార్యక్రమాలకు నిషేధం
- అనుమతులు ఇచ్చే విషయంపై ఏయూ అధికారులపై ఒత్తిళ్లు
- వసూళ్లకు తెరలేపిన కూటమి నేతలు


హెలీప్యాడ్ మైదానంలో జరుగుతున్న స్టాళ్ల పనులు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం మరో వివాదానికి కేంద్రమవుతోంది. ప్రైవేటు వ్యాపారాలకు యూనివర్సిటీ మైదానాన్ని లీజుకు ఇస్తుండడం ఏయూలో అగ్గి రాజేస్తోంది. తాజాగా ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ మైదానంలో 'దివాళీ ట్రేడ్ ఫేర్'కు అనుమతి ఇచ్చే విషయంపై గందరగోళం నెలకొంది. ఒకవైపు ఎనిమిది రోజుల పాటు మైదానాన్ని లీజుకు ఇవ్వాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఏయూ వీసీకి లేఖ రాయడం ఇపుడు హాట్ టాపిక్‌గా మారింది. ఏయూ ఆడిటోరియాలు, మైదానాల్లో ప్రైవేటు కార్యక్రమాలను నిషేధిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఈ ట్రేడ్ ఫేర్‌కు అనుమతులు ఎలా ఇస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అయితే ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రం ఈ దివాళీ ట్రేడ్ ఫేర్‌కు అనుమతులు ఇవ్వాలని ఏయూ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. మందుగుండు సామగ్రి స్టాళ్ల ఏర్పాటు పేరుతో కూటమి నేతలు భారీగా వసూళ్లకు తెరలేపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

8 రోజుల అనుమతికి లేఖ : ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ క్రీడా మైదానంలో హెలీప్యాడ్ ప్రాంతంలో స్టాళ్ల ఏర్పాటుకు ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు 8 రోజుల పాటు లీజుకు ఇవ్వాలని జీవీఎంసీ కమిషనర్ ఏయూ వీసీకి లేఖ రాశారు. ముందు నాలుగు రోజులు స్టాళ్ల ఏర్పాటుకు, మూడు రోజుల పాటు అమ్మకాలకు, మరో రోజు వాటి తొలగింపునకు మైదానాన్ని కేటాయించాలని ఆ లేఖలో కోరారు. ఈ అనుమతులపై ఏయూ అధికారులు ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేనట్లు సమాచారం. ఇటీవలే క్రెడాయ్ ఒక కార్యక్రమం నిర్వహణకు ఈ మైదానాన్ని లీజుకు కోరగా.. ఏయూ అధికారులు అందుకు అంగీకరించలేదు. ప్రైవేటు కార్యక్రమాలను ఏయూలో అనుమతి లేదన్న ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని చెప్పి క్రెడాయ్ కార్యక్రమాన్ని తిరస్కరించారు. ఇపుడు ఈ మందుగుండు సామగ్రి అమ్మకాలకు ఎలా అనుమతులిచ్చారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

స్టాల్‌కు రూ.1.5 లక్ష నుంచి రూ.2 లక్షలు : ఏయూలో స్టాళ్ల ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే కూటమి నేతలు వసూళ్లకు తెరలేపారు. ఒక్కో స్టాల్‌కు రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షలు రేటును నిర్ణయించినట్లు టాక్ వినిపిస్తోంది. వాస్తవానికి ఒక సొసైటీ పేరుతో అనుమతులకు దరఖాస్తు చేసినప్పటికీ.. తెరవెనుక కూటమి నేతలే చక్రం తిప్పాలని చూస్తున్నట్లు సమాచారం. ఫలితంగా ఏయూలో స్టాళ్ల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చేలా ప్రజాప్రతినిధులు సైతం రంగంలోకి దిగి అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

2026 నాటికి మాస్టర్ ప్లాన్ రోడ్లు పూర్తి


పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: విశాఖలో భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా మౌలిక వసతులను భారీగా అభివృద్ధి చేస్తున్నట్లు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా 15 మాస్టర్ ప్లాన్ రోడ్లను నిర్మిస్తున్నామని, వీటిలో ఏడింటి టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో పనులు మొదలవుతాయని చెప్పారు. ఈ రోడ్లను 2026 ఏప్రిల్/మే నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, దీని ద్వారా 50 నిమిషాల్లో నగరం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టుకు చేరుకోవచ్చని తెలిపారు. తాగునీటి కోసం పోలవరం ఎడమ కాలువ నుంచి నీటిని తెచ్చేందుకు ప్రణాళికలు ఉన్నాయని, అలాగే 24 చెరువులను ఆధునీకరిస్తున్నామని పేర్కొన్నారు. గూగుల్ డేటా సెంటర్ రాకతో విశాఖ రూపురేఖలు మారుతాయని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

16 నుంచి 19 వరకు షాపింగ్ ఫెస్టివల్ : జీఎస్టీ 2.0 సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమాల్లో భాగంగా నాలుగు రోజుల పాటు ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఇందులో ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఆహార తయారీ వంటి సంస్థల నుంచి సుమారు 60 స్టాళ్లు ఉంటాయని తెలిపారు. జీఎస్టీపై అవగాహన శిబిరం, సాంస్కృతిక కార్యక్రమాలు, లక్కీ డ్రా వంటివి కూడా ఉంటాయని, ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. వినియోగదారులకు చేకూరుతున్న జీఎస్టీ ప్రయోజనాలను వివరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో స్టేట్ జీఎస్టీ అదనపు కమిషనర్ ఎస్. శేఖర్, అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు, టూరిజం అధికారిణి జె. మాధవి, హోటల్స్ అండ్ టూరిజం అసోసియేషన్ ప్రతినిధి పవన్ కార్తీక్ , ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి మరోసారి దివ్యాంగుల సర్టిఫికెట్ల పరిశీలన


పరీక్షల కోసం వచ్చిన దివ్యాంగులు (ఫైల్ ఫోటో)

మహారాణిపేట: జిల్లాలో వివిధ కేటగిరీల కింద ఇస్తున్న దివ్యాంగుల పింఛన్ల రీ-వెరిఫికేషన్‌కు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. గతంలో అనర్హులుగా తేలిన 1150 మంది దివ్యాంగుల పింఛన్లను మరోసారి పరిశీలించడానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఏర్పాట్లు చేశాయి. 40 శాతం లోపు వైకల్యం ఉన్న సదరం సర్టిఫికెట్లను వైద్యుల చేత రీ-వెరిఫికేషన్ చేయనున్నారు. ఇందులో భాగంగా బుధవారం నగరంలోని నాలుగు ఆస్పత్రులలో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. జిల్లాలో మొత్తం 21,306 మంది దివ్యాంగులు ఉండగా, ఇప్పటికే 16,187 మందికి రీ-వెరిఫికేషన్ పూర్తయింది. మిగిలిన 5,119 మందికి ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. గతంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్టు గుర్తించిన 1150 మంది పింఛన్లు నిలిపివేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సచివాలయ ఉద్యోగుల ద్వారా నోటీసులు జారీ చేసిన తర్వాత, దివ్యాంగులు అప్పీల్ దరఖాస్తులు చేసుకుని, ఆందోళన చేపట్టడంతో రెండు నెలల పాటు పింఛన్లు ఇచ్చి, ప్రస్తుతం రీ-వెరిఫికేషన్ చేస్తున్నారు. ఎంపిక చేసిన ఈ నాలుగు ఆసుపత్రులలో బుధ, గురు, శుక్రవారాల్లో 40 శాతం లోపు ఉన్న సదరం సర్టిఫికెట్లను వెరిఫై చేస్తారు.

ఆస్పత్రులు	దివ్యాంగుల సంఖ్య
కేజీహెచ్	25 మంది
అగనంపూడి ఆసుపత్రి	25 మంది
ప్రాంతీయ కంటి ఆసుపత్రి	20 మంది
పెదవాల్తేరు ఈఎన్‌టీ ఆసుపత్రి	ఇద్దరు

'కె-ర్యాంప్' ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

హీరో కిరణ్ అబ్బవరం

దాబాగార్డెన్స్: సక్సెస్‌ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'కె-ర్యాంప్'. జైన్స్ నాని దర్శకత్వంలో హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యూలాయిడ్ బ్యానర్లపై రాజేష్ దండ, శివ బొమ్మ సంయుక్తంగా నిర్మించారు. దీపావళి పండగ సందర్భంగా ఈ నెల 18న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. మంగళవారం నగరంలో, విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో హీరో కిరణ్ అబ్బవరం సందడి చేశారు. 'కె-ర్యాంప్' అన్ని వయసుల ప్రేక్షకులను అలరించే యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్. సినిమాను చూసి చాలా ఎంజాయ్ చేశాం. కథలోని ఫన్ సెట్స్‌లో కూడా ఉంది. ఇది ఫ్యామిలీ అంతా కలిసి చూడదగిన చిత్రం. హీరోయిన్ యుక్తికి హీరోతో సమానమైన ప్రాధాన్యత ఉన్న పాత్ర దక్కింది. గత దీపావళికి వచ్చిన సినిమాల్లాగే, ఈసారి 'కె-ర్యాంప్' కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని గట్టిగా నమ్ముతున్నాం' అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు.

విద్యుత్ శాఖ అప్రమత్తం

ఏయూ క్యాంపస్: విద్యుత్ ఉద్యోగుల దశలవారీ ఆందోళన నేపథ్యంలో అప్రమత్తమైన విద్యుత్‌శాఖ విశాఖ జోన్-1, 2, 3, డివిజన్ల పరిధిలో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ జి.శ్యాంబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తితే దగ్గర్లోని విద్యుత్ సెక్షన్ కార్యాలయానికి లేదా టోల్ ఫ్రీ నంబరు 1912, సర్కిల్ కార్యాలయంలో 0891 2718091, జోన్-1 పరిధిలో 9490610019, జోన్-2 పరిధిలో 9490610020, జోన్-3 పరిధిలో 9491030722 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

రేపు ప్రధాని చేతులమీదుగా పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన

తాటిచెట్లపాలెం: కర్నూలు నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలు రైల్వే ప్రాజెక్టులను గురువారం వర్చువల్‌గా ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్నారు. వీటిలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేరు డివిజన్‌కు సంబంధించిన కీలక ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. రైల్వే నిర్వహణను, సరకు రవాణాను మరింత వేగవంతం చేసేందుకు కొత్తవలస-విజయనగరం మధ్య నాల్గవ లైన్‌కు, అలాగే రైల్వేకు మరింత ఆర్థిక పరిపుష్టి , వేగవంతమైన రవాణా కోసం పెందుర్తి- నార్త్ సింహాచలం మధ్య అద్భుతమైన రైల్ ఫ్లై ఓవర్ వంతెనల పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. అంతేకాకుండా, వాల్తేరు డివిజన్ పరిధిలో అత్యంత కీలకమైన కొత్తవలస-బొడ్డవర, శిమిలిగుడ-గోరాపూర్ మధ్య నిర్మించిన డబ్లింగ్ (రెండో లైన్) ప్రాజెక్టులను కూడా ప్రధాని ప్రారంభించ నున్నారు. ఈ ప్రాజెక్టుల ప్రారంభం వలన ఈ సెక్షన్‌లో ప్రయాణికుల రవాణా, సరకు రవాణా మరింత వేగవంతంగా, సుఖంగా, సురక్షితంగా చేపట్టవచ్చని అధికారులు తెలిపారు.

కూటమి నిర్లక్ష్యం.. పేదలకు ప్రాణ సంకటం

- ఆరోగ్యశ్రీ బిల్లుల పెండింగ్‌తో పేదలకు ఆరోగ్య భరోసా దూరం
- రోగులను జలగల్లా పీల్చుతున్న కార్పొరేట్ ఆస్పత్రులు
- వైద్యం పేరుతో అడ్డూ అదుపు లేకుండా దోపిడీ
- అవసరం లేకపోయినా పరీక్షలు



మహారాణిపేట: జిల్లాలోని పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించే వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోందన్న విమర్శలు తీవ్రమవుతున్నాయి. ఒకవైపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో లేక రోగులు అవస్థలు పడుతుంటే, మరోవైపు కార్పొరేట్ ఆస్పత్రులకు చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు నిలిచిపోయాయి.

ఆరోగ్యశ్రీకి అనారోగ్యం

పేదలకు భరోసాగా ఉన్న ఆరోగ్యశ్రీ ప్రస్తుతం అనారోగ్యశ్రీగా మారిందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద అందించిన వైద్యానికి సంబంధించి కూటమి సర్కారు నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు సేవలను నిలిపివేశాయి. దీంతో నాలుగు రోజులుగా కార్పొరేట్, నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందక రోగులు అల్లాడిపోతున్నారు. జిల్లాలో బకాయిలు చెల్లించకపోవడంతో 62 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఓపీ, ఐపీ సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. అన్ని రకాల వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు నిలుపుదల కావడంతో పేద రోగుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. నెట్‌వర్క్ ఆస్పత్రులకు వచ్చే పేద రోగులకు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలని వైద్యమిత్రులు, ఆరోగ్యమిత్రులు సూచనలు ఇస్తున్నారు. ఈ పరిస్థితి పేద రోగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు కూడా వైద్య సేవల్లో ఇబ్బందులు కలిగిస్తోంది.

పడకేసిన పల్లె వైద్యం

పల్లెల్లో వైద్యం పడకేసింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 'ఇన్ సర్వీస్ పీజీ కోటా' పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ పీహెచ్‌సీల్లో వైద్యులు గత నెల 26 నుంచి ఆందోళన చేస్తున్నారు. గత నెల 29 నుంచి ఓపీలను బహిష్కరించిన వైద్యులు, అక్టోబర్ 1వ తేదీ నుంచి సమ్మె బాట పట్టారు. దీంతో రోగులకు అరకొరగా సేవలు అందుతున్నాయి. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న సమయంలో వైద్యులు లేకపోవడంతో జ్వరాల బారిన పడుతున్న పల్లె ప్రజలకు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులే డాక్టర్ల అవతారం ఎత్తి మందు బిళ్లలు ఇచ్చి పంపుతున్నారు.

పేదల వైద్యంపై చిన్నచూపు

ఒకవైపు ఆరోగ్యశ్రీ సేవలకు అంతరాయం, మరోవైపు పీహెచ్‌సీల్లో వైద్యుల సమ్మెతో వైద్య సేవలు నిలిచిపోవడంతో పేద రోగులు వైద్యం కోసం అల్లాడిపోతున్నారు. దాదాపు ఏడాదిన్నర కాలంగా వైద్య సేవలు అందించిన నెట్‌వర్క్ ఆస్పత్రులకు కూటమి సర్కారు చిల్లిగవ్వ కూడా విడుదల చేయలేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో ఆస్పత్రుల నిర్వహణపై తీవ్ర ప్రభావం పడింది. బకాయిలు చెల్లించకుంటే తాము ఆస్పత్రులను నడపలేమని ఏపీ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ (ఆశా) ప్రకటించింది. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా పేదలకు అందే ఆరోగ్యశ్రీ సేవలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సేవలు అందించే ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్), వర్కింగ్ జర్నలిస్టుల వైద్య సేవలకు కూడా కొంతవరకు బ్రేక్ పడింది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స కోసం వెళ్తే అవసరం లేని అనేక పరీక్షలు రాస్తూ, అధిక ఫీజులు వసూలు చేయడంతో పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారిందని, వైద్యం పేరు ఎత్తితేనే భయపడే పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరేళ్ల తర్వాత చిక్కిన హత్యకేసు నిందితుడు


ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ నర్సింహమూర్తి

ఆరిలోవ: కోర్టు కేసు నడుస్తుండగా ఆరేళ్ల క్రితం పరారైన ఓ హత్య కేసులోని ప్రధాన నిందితుడిని ఆరిలోవ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఎన్ని చోట్ల గుట్టుగా గడిపినా చివరికి వెతికి పట్టుకుని, కటకటాల వెనక్కి పంపించారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ద్వారకా జోన్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి మంగళవారం మీడియాకు తెలిపిన వివరాలు..

ఆరిలోవ ప్రాంతం ప్రియదర్శినికాలనీ, సెయింట్ ఆన్స్ స్కూల్ వెనుక 2011 జూన్ 12న పందిరి రవి అలియాస్ చిత్తిరి రవి హత్యకు గురయ్యాడు. పాత కక్షల కారణంగా రవిని బాలాజీ నగర్‌కు చెందిన తిరుమల రాఘవరాజు(ప్రస్తుత వయసు 40)తో పాటు మరో ఆరుగురు కలసి కత్తులతో దాడిచేసి సినీ ఫక్కీలో హత్య చేశారు. ఈ కేసులో ఏడుగురు ముద్దాయిలను ఆరిలోవ పోలీసులు అప్పట్లో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అదే ఏడాది జూలై 1న వారిపై రౌడీ షీట్లు తెరిచారు. కోర్టులో కేసు నడుస్తుండగా ఏ1 ముద్దాయి రాఘవరాజు 2019 జూలై 24 నుంచి కోర్టు వాయిదాలకు హాజరు కాలేదు. రౌడీ షీట్ ఉన్నందున పోలీస్ స్టేషన్‌కూ వెళ్లకుండా పరారయ్యాడు. అప్పటి నుంచి పోలీసులు అతని కోసం ఎంత గాలించినా పట్టుబడలేదు. దీంతో కోర్టు 2023 మార్చి 10న మిగిలిన ఆరుగురు ముద్దాయిలకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అప్పటికే ఈ కేసులో ఉన్న ముగ్గురు ముద్దాయిలు మరణించారు. మిగిలిన ముగ్గురు ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆరిలోవ సీఐ హెచ్.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ పీడీబీ శంకర్, పీఎస్ఐ వరహాలు నాయుడు, కానిస్టేబుల్ జి.అప్పారావు బృందం ఆరు నెలల పాటు ప్రత్యేక నిఘా పెట్టారు. డిజిటల్ వాచ్ చేపట్టారు. చోడవరం ప్రాంతంలో ముద్దాయి ఓ క్వారీలో కూలీగా పనిచేస్తున్నట్లు తెలుసుకుని అక్కడకు చేరుకొన్నారు. పోలీసుల ఆచూకీ గమనించిన ముద్దాయి అక్కడి నుంచి అనకాపల్లి ప్రాంతానికి చేరుకుని కొన్నాళ్లు ట్యాక్సీవాలా అవతారం ఎత్తాడు. అతని ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు అనకాపల్లి మారుమూల గ్రామంలో మంగళవారం తిరుమల రాఘవరాజును పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ నర్సింహమూర్తితో పాటు సీపీ శంఖబ్రత బాగ్చి ఫోన్‌లో సీఐ మల్లేశ్వరరావు బృందాన్ని అభినందించారు.

'తురకపాలెం మృతుల పట్ల ప్రభుత్వం వివక్ష'


మాట్లాడుతున్న ఐక్య వేదిక కన్వీనర్ వెంకటరావు

సీతంపేట: ఇటీవల గుంటూరు జిల్లా తురకపాలెంలో కలుషిత నీరు తాగి మృత్యువాత పడిన కుటుంబాలకు నష్టపరిహారం చెల్లింపులో ప్రభుత్వం వివక్ష చూపిందని విస్తృత దళిత సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ బూసి వెంకటరావు విమర్శించారు. స్థానిక రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి తొక్కిసలాట మృతులకు రూ.25 లక్షలు చెల్లించిన ప్రభుత్వం, తురకపాలెం మృతులకు కేవలం రూ.5 లక్షలు చెల్లించడం అన్యాయమని, తక్షణమే నష్టపరిహారం రూ.25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. తురకపాలెంలో వింత వ్యాధితో 40 మందికి పైగా మరణిస్తే, నెలలు గడిచినా బాధిత కుటుంబాలకు సరైన న్యాయం జరగలేదన్నారు. విషయాన్ని జాతీయ ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లగా, ప్రభుత్వం కంగారు పడి మొక్కుబడిగా రూ.5 లక్షలు పరిహారం చెల్లించి చేతులు దులిపేసుకుందన్నారు. తాగునీటిలో ఈకోలై, మెలియో వంటి ప్రమాదకర బ్యాక్టీరియా కలిసి మరణాలు సంభవించాయని, ఇది పూర్తిగా ప్రభుత్వ యంత్రాంగ నిర్లక్ష్యమేనన్నారు. సమావేశంలో జాజి ఓంకార్, బూల భాస్కరరావు, గుడివాడ ప్రసాద్, యూఎస్ రాజు, సీహెచ్ దాలయ్య, కస్తూరి వెంకటరావు, సన్యాసిరావు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలను ప్రభుత్వమే కొనసాగించాలి


అక్కయ్యపాలెం బస్టాప్ వద్ద సంతకాలు సేకరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు


మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నష్టాలను విద్యార్థులకు వివరిస్తున్న కేకే రాజు

కోటి సంతకాల సేకరణలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

సీతంపేట: గత వందేళ్ల రాష్ట్ర చరిత్రలో కేవలం 11 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రంతో మాట్లాడి ఒకేసారి 17 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు అన్ని అనుమతులు తేవడం చారిత్రాత్మకమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. మెడికల్ కళాశాలల్ని ప్రైవేటీకరణ చెయ్యాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం హైవే వద్ద మంగళవారం చేపట్టిన కోటి సంతకాల సేకరణలో ఆయన పాల్గొన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేట్‌పరం చేస్తే భవిష్యత్‌లో యువత ఎదుర్కొనే ఇబ్బందుల్ని వివరించి, ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్‌జగన్ మారుమూల ప్రాంత ప్రజలకు సైతం మెరుగైన వైద్యం అందేలా 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు అనుమతులు సాధించారన్నారు. వీటి వల్ల రాష్ట్రంలో అదనంగా 2,550 ఎంబీబీఎస్ సీట్లు పెరుగుతాయని, ఎంతో మంది పేద, మధ్యతరగతి పిల్లలకు వైద్య విద్య అందుబాటులోకి వస్తుందని ఆశించారన్నారు. ప్రతి మెడికల్ కళాశాలకు అనుబంధంగా 500 పడకల ఆస్పత్రితో ప్రజలకు ఉచితంగా వైద్యం అందేలా కృషి చేశారన్నారు. అమరావతిపై ఖర్చు చేసే రూ.లక్షల కోట్లలో కేవలం రూ.4 వేల కోట్లు వెచ్చిస్తే పెండింగ్‌లో ఉన్న మెడికల్ కళాశాలలన్నీ ప్రజలకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, దానికి నిదర్శనం కోటి సంతకాల సేకరణకు ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందనే అన్నారు. కూటమి ప్రభుత్వ తప్పుడు నిర్ణయంపై ప్రజల అభిప్రాయాన్ని సంతకాల రూపంలో సేకరించి గవర్నర్‌కు అందజేయనున్నట్లు వెల్లడించారు. మెడికల్ కాలేజీలు ప్రభుత్వ రంగంలో కొనసాగే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు.

కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, బర్కత్ ఆలీ, కోఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, వలంటీర్ విభాగం జోనల్ అధ్యక్షుడు ఎం.సునీల్ కుమార్, జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి బాణాల తరుణ్‌కుమార్, నీలి రవి, శ్రీదేవి వర్మ, వార్డు అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, భీశెట్టి ప్రసాద్, హబీబ్, బలిరెడ్డి గోవింద్, కె.సుకుమార్, ఐ.రవికుమార్, మాజీ కార్పొరేటర్ పామేటి బాబ్జి, నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు షేక్ బాబ్జి, బాధ శ్రీను, జిల్లా కమిటీనాయకులు సాడి కేశవ్, బోగవిల్లి గోవింద్, జక్కంపూడి సత్యనారాయణ, చిరంజీవి, ఎర్రంశెట్టి శ్రీను, పద్మా శేఖర్, గంగా మహేష్, పారుపల్లి రవి, కె.చిన్న, మహేష్‌బాబు, మహాదాస్య గోపి, మౌనిక, కడితి రమేష్, అనిల్, బషీర్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్తీకం స్పెషల్స్

పంచారామాలు, లంబసింగి టూర్ ప్యాకేజీలు

దాబాగార్డెన్స్: పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భక్తులు, పర్యాటకుల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జిల్లాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పంచారామాలు, శబరిమలై దర్శనంతో పాటు లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు టూర్ ప్యాకేజీలను ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చింది. ఈ వివరాలను జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు మంగళవారం వెల్లడించారు.

ఒకే రోజులో పంచారామాల దర్శనం

కార్తీక మాసంలో వచ్చే ప్రతి శని, ఆదివారాల్లో (ఈ నెల 25, 26, నవంబర్ 1, 2, 8, 9, 15, 16) సాయంత్రం 5 గంటలకు విశాఖ ద్వారకా బస్టేషన్ కాంప్లెక్స్ నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయి. అమరావతి (అమరేశ్వరస్వామి), భీమవరం (సోమేశ్వరస్వామి), పాలకొల్లు (క్షీర రామలింగేశ్వరస్వామి), ద్రాక్షారామం (భీమేశ్వరస్వామి), సామర్లకోట (కుమార రామలింగేశ్వరస్వామి) – ఈ ఐదు పంచారామాలను ఒకే రోజులో దర్శించుకునేలా ఈ సర్వీసులను నడపనున్నట్టు ఆయన తెలిపారు.

పంచారామాల ప్రయాణ చార్జీలు (ఒక్కరికి):

సూపర్ లగ్జరీ	రూ. 2,200
అల్ట్రా డీలక్స్	రూ. 2,150
ఇంద్ర (ఏసీ)	రూ. 2,800

లంబసింగి పిక్నిక్ టూర్

కార్తీక మాసంలో పిక్నిక్‌లకు వెళ్లే పర్యాటకుల కోసం లంబసింగి టూర్‌ను కూడా ఆర్టీసీ ప్రారంభించింది. ఈ టూర్ శని, ఆదివారాల్లో ఉదయం 3 గంటలకు ద్వారకా బస్టేషన్ నుంచి బయలుదేరుతుంది. ఈ ప్యాకేజీలో లంబసింగి, తాజంగి డ్యామ్, కొత్తపల్లి వాటర్‌ఫాల్స్, మోదమాంబ గుడి, కాఫీ ప్లాంటేషన్ ప్రాంతాలను చూపించనున్నారు.

టూర్ చార్జీలు : అల్ట్రా డీలక్స్ రూ. 800, ఎక్స్‌ప్రెస్ – రూ. 650.

ధారమట్టం టూర్:

శని, ఆదివారాల్లో ఉదయం 7 గంటలకు ద్వారకా బస్టేషన్ నుంచి ధారమట్టం టూర్ బస్సులు బయలుదేరుతాయి. ఈ టూర్‌లో శివాలయం, ధారమట్టం వాటర్‌ఫాల్స్, అల్లూరి సీతారామరాజు మ్యూజియం, బొజ్జనకొండ (అనకాపల్లి) దర్శనీయ ప్రాంతాలు ఉంటాయి.

టూర్ ఛార్జీలు: సూపర్ లగ్జరీ – రూ. 650, అల్ట్రా డీలక్స్ – రూ. 550

శబరిమలై, ఇతర టూర్స్

శబరిమలై వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం కూడా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనుంది. భక్తులు ముందుగానే సీట్లు రిజర్వ్ చేసుకోవాలని డీపీటీఓ కోరారు. కార్తీక మాసంలో విజ్ఞాన విహార యాత్రలకు కూడా అద్దె ప్రాతిపదికన బస్సులు ఇవ్వనున్నామని, గ్రూపులుగా వచ్చినచో వారు కోరిన రోజున టూర్ స్పెషల్స్ నడపనున్నట్లు అప్పలనాయుడు తెలిపారు.

రిజర్వేషన్లు: పంచారామ దర్శినీ, పిక్నిక్‌లు, మార్గశిర మాసంలో పంచవైష్ణవి క్షేత్ర దర్శనాల కోసం వెళ్లే భక్తులు www.apsrtconline.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ రిజర్వేషన్ చేసుకోవచ్చు. ద్వారకా బస్టేషన్ వద్ద గల రిజర్వేషన్ కౌంటర్ వద్ద కూడా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. **వివరాలకు: 9959225602, 9052227083, 9959225594, 9100109731** నంబర్లలో సంప్రదించవచ్చు.

బావ అంత్యక్రియలకు వెళ్లి.. గోస్తనీలో గల్లంతు

తగరపువలస: ఆత్మహత్యకు పాల్పడ్డ బావ అంత్యక్రియల అనంతరం, గోస్తనీలో స్నానానికి దిగి గల్లంతయిన ఘటన మంగళవారం జరిగింది. భీమిలి పోలీసులు తెలిపిన వివరాలు. జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బాలాజీనగర్‌కు చెందిన పీసా త్రిమూర్తులు సోమవారం తన ఇంట్లో ఉరేసుకుని మరణించాడు. అతని అంత్యక్రియలు మంగళవారం బాలాజీ నగర్ శ్మశానవాటికలో జరిగాయి. ఈ అంత్యక్రియలకు హాజరైన మృతుడు త్రిమూర్తులు మేనత్త కొడుకు తమ్మిన శ్రీను(36), అంత్యక్రియల అనంతరం గోస్తనీలో స్నానానికి దిగినదీ ప్రవాహం ఎక్కువగా ఉండటంతో కొట్టుకుపోయినట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. శ్రీనుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనకాపల్లి జిల్లాలో సెక్టోరల్ ఆఫీసర్ల నియామకంపై విచారణ

మధురవాడ : అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష విభాగంలో సెక్టోరల్ ఆఫీసర్‌ల నియామకాల్లో అవకతవకలు జరిగాయని వచ్చిన ఫిర్యాదుపై విద్యా శాఖ ఆర్‌జేడీ కార్యాలయంలో ఆర్‌జేడీ విజయభాస్కర్ మంగళవారం విచారణ ప్రారంభించారు. జిల్లా సెక్టోరల్ ఆఫీసర్‌ల నియామకాల్లో సీనియారిటీ, వయస్సు వంటి నిబంధనలు సక్రమంగా పాటించకుండా వ్యవహరించారని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్‌పీడీకి ఫిర్యాదు చేశారు. ఎస్‌పీడీ ఆదేశాల మేరకు ఇరు పక్షాలను విచారణకు పిలిచినట్టు అధికారులు తెలిపారు. విచారణ ఇంకా కొనసాగుతోందని, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని ఆర్‌జేడీ విజయభాస్కర్ వెల్లడించారు.

కురుపాం విద్యార్థినులకు మెరుగైన వైద్యం

- ఇప్పటివరకు 59 మంది డిశ్చార్జ్
- రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి


కేజీహెచ్‌లో విద్యార్థినిని పరామర్శిస్తున్న మంత్రి సంధ్యారాణి

మహారాణిపేట: కురుపాం గిరిజన బాలికల పాఠశాలలో అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులు 65 మందిలో 59 మందిని డిశ్చార్జ్ చేసినట్టు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం మంత్రి సంధ్యారాణి కేజీహెచ్‌ను సందర్శించి, చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి అందుతున్న వైద్య సేవలను గురించి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి గుమ్మడి సంధ్యారాణి మీడియాతో మాట్లాడుతూ కురుపాం గిరిజన బాలికల పాఠశాలలో మొత్తం 146 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. అస్వస్థతకు గురైన వారిలో 65 మంది బాలికలను జాండీస్, జ్వరంతో బాధపడుతుండటంతో మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌లో చేర్చడం జరిగిందన్నారు. కేజీహెచ్‌లో మెరుగైన వైద్యం అందించడం ద్వారా 59 విద్యార్థినులు పూర్తిగా కోలుకొని వారి ఇళ్లకు తిరిగి వెళ్లడం జరిగిందన్నారు. మరో 6 గురిలో ముగ్గుర్ని కూడా డిశ్చార్జ్ చేయనున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న హాస్టల్స్, ఏకలవ్య స్కూల్స్, గురుకుల పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాలు, మరమ్మతులకు సీఎం రూ. 90 కోట్లు మంజూరు చేసినట్లుగా మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఈ సందర్భంగా వివరించారు.

వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా కలెక్టర్

విశాఖ సిటీ: విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ) ఇన్‌చార్జి కమిషనర్‌గా కలెక్టర్ హరేందిర ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన కె.ఎస్.విశ్వనాథన్ ఐ అండ్ పీఆర్ డైరెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో కొత్తగా ఎవరినీ నియమించలేదు. కలెక్టర్ హరేందిరప్రసాద్‌కు పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్‌ఏసీ) అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మెట్రోపాలిటన్ ఇంచార్జ్ కమిషనర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థ చేపట్టిన పలు అభివృద్ధి పనుల స్థితిగతులపై చర్చించారు.

అనంతుని పవిత్రోత్సవాలకు ఏర్పాట్లు

- 18న స్వామికి పవిత్రాల సమర్పణ
- శ్రీరంగం నుంచి ఇప్పటికే చేరిన పవిత్రాలు
- 19న పవిత్రాల విసర్జన, శాంతి కల్యాణం


పవిత్రాలతో అలంకరణ చేయనున్న వివిధ దేవతా మూర్తులు

పద్మనాభం: స్థానిక కుంతీ మాధవస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి 19 వరకు అనంత పద్మనాభస్వామి పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు ఆలయ అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. పవిత్రోత్సవాలకు అవసరమయ్యే పవిత్రాలను తమిళనాడులోని శ్రీరంగం నుంచి తీసుకొచ్చి, ఆలయంలో భద్రపరిచారు. నూతన వస్త్రాలు సమకూర్చారు. 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు పవిత్రోత్సవాలు ప్రాంభమవుతాయి. ఉత్సవాల్లో భాగంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 17న అగ్ని మథనం, అగ్ని ప్రతిష్టాపన, నిత్యహోమాలు, మూల మంత్రహోమం, పవిత్రాలకు అభిమంత్రణ, మహాశాంతి హోమం జరుపుతారు. 18న అష్ట కలశ స్నపన, పంచామృత అభిషేకాలు, నిత్య హోమం అనంతరం శ్రీరంగం నుంచి తెచ్చిన పవిత్రాలను స్వామికి సమర్పిస్తారు. కుంతీ మాధవస్వామి ఆలయంలోని కుంతీ మాధవస్వామి, శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి పెద్ద ఉత్సవ విగ్రహాలకు, చిన్న ఉత్సవ విగ్రహాలకు, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, గోదాదేవి, లక్ష్మీదేవి, గిరిపై ఉన్న అనంత పద్మనాభ స్వామికి పవిత్రాలు సమర్పిస్తారు. పవిత్రాల అలకరణలో ఈ మూర్తులు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి. 19న ఉదయం విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, నిత్య హోమం అనంతరం పవిత్రాలను విసర్జింప చేస్తారు. పూర్ణాహుతి నిర్వహించి, కుంతీ మాధవస్వామి ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా రూపొందించిన వేదిక వద్దకు తోడ్కొని వస్తారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఉదయం 11 గంటలకు శాంతి కల్యాణంతో పవిత్రోత్సవాలు ముగుస్తాయి.